## విద్యార్థులకు అభినందన

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబరిచారు. కళాశాలకు చెందిన విద్యార్థులు అనిల్ 3 కిలో మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం సాధించగా.. వరలక్ష్మి 3, 5 కిలోమీటర్ల పందెంలో రజతం, కాంస్య పతకాలు సాధించింది. విద్యార్థి రెనాటా జోసఫ్ 400, 800 మీటర్ల పరుగులో బంగారు, రజత పతకాలు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి టీవీ.రెడ్డి, డైరెక్టర్లు సరోజారెడ్డి, అనురాగ్ రెడ్డి, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, పీఆర్వో రవిసుధాకర్, వెంకటనారాయణ, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

## మహంకాళి ఆలయంలో చండీహోమం



పోచారం: కొర్రెముల్‌లోని మహంకాళి సమేత బ్రహ్మసూత్ర నీలకంఠస్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం ఉదయం రుద్రాభిషేకం, చండీహోమం, మంత్రపుష్పం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రసాదవితరణ చేశారు. అదే రోజు సాయంత్రం విష్ణుసహస్రనామ పారాయణం చేశారు. మాజీ సర్పంచ్ ఓరుగంటి కవిత వెంకటేష్, ఆలయ అర్చకులు రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## కీసరలో విశేష పూజలు



సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహిస్తున్న అర్చకులు

కీసర: శ్రావణమాసం ప్రత్యేక పూజల్లో భాగంగా మంగళవారం ఏకాదశి సందర్భంగా కీసరగుట్ట రామలింగేశ్వరస్వామి సన్నిధిలో అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. గర్భాలయంలోని స్వామివారికి ఉదయం మహన్యాస పూర్వక రుద్రాభిషేకం చేశారు. అనంతరం అర్చకులు స్వామివారికి క్షీరాభిషేకం కన్నుల పండువగా జరిగింది. అనంతరం మహా మండపంలో సత్యనారాయణస్వామివ్రతాన్ని నిర్వహించారు. ఆలయ చైర్మన్ తటాకం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ సామగ్రి వేలం

శామీర్‌పేట్: అలియాబాద్ మున్సిపాలిటీలోని స్క్రాప్‌ను బుధవారం కమిషనర్ చంద్రశేఖర్ అధ్యక్షతన మంగళవారం వేలంపాట నిర్వహించారు. అలియాబాద్ మున్సిపాలిటీ కార్యాలయంలో నిర్వహించిన స్క్రాప్ వేలంలో 11 మంది పాల్గొనగా.. మహమ్మద్ జావేద్ అలీ రూ. 3.27 లక్షలకు దక్కించుకున్నారు. ఇన్‌చార్జ్ రెవెన్యూ ఆఫీసర్ వేణుగోపాల్, ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, అసిస్టెంట్ ఇంజినీర్ సనా, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్లకు స్టిక్కర్ల పంపిణీ

మేడ్చల్: పట్టణంలోని ఆటో డ్రైవర్లకు 'మై ఆటో ఈస్ సేఫ్' స్టిక్కర్లను మంగళవారం మేడ్చల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ హనుమాన్‌గౌడ్ పంపిణీ చేశారు. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆటో డ్రైవర్లకు స్టిక్కర్లు అందజేసి పలు సూచనలు చేశారు. ప్రతి ఆటో డ్రైవర్ నిబంధనలు పాటించాలని కోరారు.

## టీపీఓపై సీపీఎం నేతల ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న సీపీఎం నేతలు

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ టౌన్ ప్లానింగ్ అధికారి రాధాకృష్ణ గత 2 నెలలుగా కనబడటం లేదంటూ సీపీఎం నాయకులు మేడ్చల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మేడ్చల్ పట్టణంలోని కేఎల్ఆర్ వెంచర్‌లో పార్కు స్థలం కబ్జాపై గతంలో సీపీఎం పార్టీ తరఫున మున్సిపల్ కమిషనర్, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా.. కలెక్టర్ కార్యాలయం నుంచి కబ్జాపై విచారణ జరపాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. విచారణ జరిపిన టీపీఓ అక్రమ కట్టడంగా తేల్చి వాటిని నేలమట్టం చేస్తానని, 2 నెలల క్రితం చెప్పారని అప్పటి నుంచి అందుబాటులో లేకుండా పోయారన్నారు. అందుకే తాము పోలీసులను ఆశ్రయించినట్లు వివరించారు.

# బాలికల భద్రతకు భరోసా !

- ప్రభుత్వ పాఠశాలల్లో సాధికారత కమిటీలు
- ఆడపిల్లల్లో ఆత్మస్థైర్యాన్ని పెంచేందుకు విద్యాశాఖ చర్యలు



సాక్షి,మేడ్చల్ జిల్లా: సమాజంలో ఆడపిల్లలు ఎదుర్కొంటున్న లింగ వివక్ష, హింస, వేధింపులను బాల్య దశ నుంచే అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. స్కూల్‌ల్లో బాలికలకు భరోసా లక్ష్యంగా సాధికారత క్లబ్ (కమిటీలు)లను విద్యాశాఖ ఏర్పాటు చేస్తోంది. దీనిలో భాగంగా సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవడం, అప్రమత్తంగా ఉండటం, ఆపదలో స్పందించాల్సిన తీరుపై నగర శివారు మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలలో బాలికలకు అవగాహన కల్పిస్తున్నారు.

**పోలీసు, విద్యాశాఖల ఆధ్వర్యంలో..**

విద్యాశాఖ, పోలీసుశాఖల సమన్వయంతో స్కూళ్లల్లో బాలికా సాధికారత కమిటీలు పనిచేస్తాయి. దీంట్లో ప్రతి తరగతి నుంచి ఇద్దరు చురుకైన అమ్మాయిలు సభ్యులుగా ఉంటారు. వీరే స్కూల్ బ్రాండ్ అంబాసిడర్లుగా వ్యవహరిస్తారు. ఈ కమిటీలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు చైర్మన్‌గా, ఒక ఉపాధ్యాయురాలు మెంబర్ కన్వీనర్, షీ టీమ్ ప్రతినిధులు సభ్యులుగా ఉంటారు. క్లిష్ట పరిస్థితుల్లో ధైర్యంగా ఎదుర్కొనేలా.. జీవితంలో విజయం సాధించేలా బాలికలను తీర్చిదిద్దటమే లక్ష్యంగా ఈ సాధికారత కమిటీలు పనిచేస్తాయి.

**మానసిక స్థైర్యం పెంపొందించేందుకు..**

సమాజంలో మహిళలు ముఖ్యంగా బాలికలపై ఎలాంటి అమానుష ఘటనలు జరుగుతున్నాయో వీరికి అవగాహన కల్పిస్తారు. మానసిక ధైర్యానికి తోడు చట్టం అండగా నిలవాల్సి ఉంటుంది. ఆ నమ్మకాన్ని కలిగించేలా అధికారులు తగిన చర్యలు తీసుకుంటారు.



క్లాస్‌రూమ్‌లో చదువుకుంటున్న విద్యార్థులు

**కమిటీ కార్యక్రమాలివే..**

నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలలో 1808 ప్రభుత్వ పాఠశాలలు (మేడ్చల్ జిల్లాలో 507,రంగారెడ్డిలో 1,301) ఉండగా.. దాదాపు మూడు లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో దాదాపు సగానికి దగ్గరగా బాలికలు ఉన్నారు. ఈ కమిటీల ఏర్పాటు మొదలు.. వచ్చే ఏడాది ఫిబ్రవరి రెండో వారం వరకు పాఠశాలల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించగా.. విద్యాశాఖ అమలు చేస్తోంది. డయల్ 100, 1098, 181, 112 వంటి టోల్‌ఫ్రీ నంబర్లను కూడా పాఠశాలల్లో ప్రదర్శిస్తారు. బాలికల్లో ఎదుగుదలతో పాటు వచ్చే మార్పులు, శారీరక ఆరోగ్య సమస్యలు, వ్యక్తిగత పరిశుభ్రత ఆవశ్యకత, జీవన నైపుణ్యాలపై అవగాహన కల్పిస్తారు. బాల్య వివాహాలు, హింస వంటి సమస్యలపై స్త్రీ, శిశు సంక్షేమశాఖ అవగాహన కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు లైంగిక దాడులు అడ్డుకోవడంపై సదస్సులు ఏర్పాటు చేస్తారు. ప్రధానంగా బాలికలు మానసికంగా ధైర్యంగా ఎదిగేందుకు శిక్షణనిస్తారు.

**ధైర్యంగా ఎదుర్కొనేలా తీర్చిదిద్దుతాం**



అన్ని ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, మోడల్ స్కూళ్లల్లో బాలికల సాధికారత క్లబ్ (కమిటీ)ల ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేశాం. బాలికలకు ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ధైర్యంగా ఎదుర్కొనేలా సిద్ధం చేస్తాం. బాలికలను ప్రతి ఒక్కరూ గౌరవించాలి. ఆ దిశగా పాఠశాలలు, కుటుంబాలతో పాటు సమాజంలో మార్పు రావాల్సిన అవసరం ఉంది.

– విజయకుమారి, జిల్లా విద్యాశాఖాధికారి, మేడ్చల్, మల్కాజిగిరి

## విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

**ప్రభుత్వ స్కూల్‌ను సందర్శించిన అదనపు కలెక్టర్**



విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

శామీర్‌పేట్: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా అన్నారు. మంగళవారం తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని తూంకుంట, సంగాయిపల్లి ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆహార నాణ్యత, మెనూ గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి, విద్యార్థులకు అర్థమయ్యే మెలుకువలతో విద్యను బోధించాలని ఉపాధ్యాయులకు ఆమె సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని విద్యార్థులకు అదనపు కలెక్టర్ సూచించారు. అనంతరం వంటగదిని పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. విద్యాశాఖ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

సాక్షి,మేడ్చల్ జిల్లా: ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) ఆధ్వర్యంలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై మంగళవారం ధర్నా చేశారు. పాఠశాలల ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని టీచర్లు ఈ సందర్భంగా నినాదాలు చేశారు. స్కూళ్లకు ఉచిత విద్యుత్, పారిశుద్ధ్య నిర్వహణ నిధుల విడుదలతో పాటు ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను ప్రభుత్వం కల్పించడంపై ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ హర్షం వ్యక్తం చేస్తూనే.. దీర్ఘకాలికంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేసింది.

◆ ప్రభుత్వ జిల్లా, మండల పరిషత్, గిరిజన సంక్షేమ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై కొనసాగుతున్న నిర్లక్ష్యంపై ప్రభుత్వం శ్రద్ధ చూపాలని పోరాట కమిటీ కోరింది. ప్రభుత్వ పాఠశాలలపై విద్యార్థుల తల్లిదండ్రులకు విశ్వాసం కలిగించేలా విద్యారంగాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు మాణిక్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు జయసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి మదన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శులు సత్యనారాయణ, శ్రీనివాస్, కుమార్ స్వామి, రాకేష్, మైపాల్‌రెడ్డి, ఉపేందర్, టీపీటీఎఫ్ అధ్యక్షుడు రాఘవేందర్, ప్రధాన కార్యదర్శి బ్రహ్మాచారి, శామీర్‌పేట్ మండల అధ్యక్షుడు తిరుమలేష్, ప్రధాన కార్యదర్శి కుమార్, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలి



అవగాహన కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ

శామీర్‌పేట్: రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించుకుని పంటలు పండించాలని జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ అన్నారు. మంగళవారం మూడుచింతలపల్లి మున్సిపాలిటీ, ఉద్దమర్రిలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రైతులు రసాయన ఎరువులు, పురుగుమందుల పైన ఆధారపడకుండా పెట్టుబడి తగ్గించుకోవాలన్నారు. పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. మేడ్చల్ సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకట్‌రాంరెడ్డి, మండల వ్యవసాయాధికారి రవికుమార్, వ్యవసాయ శాస్త్రవేత్తలు మధు శేఖర్, దిలీప్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్ బిల్డింగ్ సీజ్

శామీర్‌పేట్: తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని తూంకుంటలో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్న మూడు కట్టడాలను అధికారులు సీజ్ చేశారు. భవన యజమానులకు నోటీసులు జారీ చేసినా పనులు ఆపడం లేదని, మున్సిపల్ చట్టం 2019 సెక్షన్ 18 ప్రకారం తూంకుంట మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీధర్ నేతృత్వంలో సంబంధిత వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, టౌన్ ప్లానింగ్ సిబ్బందితో కలిసి మంగళవారం తూంకుంటలోని ఎంఎం రెడ్డి కాలనీలోని విజన్ స్కూల్ బిల్డింగ్, వేంకటేశ్వర కాలనీలోని రెండు కట్టడాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ జ్యోతి మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడైనా అక్రమ నిర్మాణాలు చేపట్టినా, అనుమతికి విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వైద్య ఖర్చులకు చిన్నారికి ఆర్థికసాయం

ఘట్‌కేసర్: తెల్ల రక్తకణాల క్షీణతవ్యాధితో బాధపడుతున్న ఐదేళ్ల చిన్నారికి మున్సిపాలిటీలోని ఎన్ఎఫ్‌సీనగర్ సన్‌రైజ్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు అండగా నిలిచారు. మల్కాజ్‌గిరికి చెందిన రాజేంద్రప్రసాద్ కుమార్తె అనివ్రక (5) తెల్లరక్త కణాల క్షీణత వ్యాధితో బాధపడుతోంది. పేదవారు కావడంతో ప్రతి వారం ఆస్పత్రికి వెళ్లి తెల్లరక్త కణాలు ఎక్కించుకోవాలల్సిన ఆస్పత్రి బిల్లులు భరించలేక పోతున్నారు. దీంతో బాధితులు ట్రస్ట్ సభ్యులను సంప్రదించగా.. మంగళవారం రూ. 20 వేల చెక్కును అందజేశారు. ట్రస్ట్ సభ్యులు స్వరూప, సుందరరావు, శ్రీకాంత్, సోమయ్య, వీరారెడ్డి, రామయ్య, బాబు, మల్లికార్జున్‌రావు పాల్గొన్నారు.

## వాలీబాల్ పోటీల్లో నర్సింగ్ విద్యార్థుల ప్రతిభ

మేడ్చల్‌రూరల్: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో మెడిసిటీ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థులు సత్తా చాటారు. సంగారెడ్డి జిల్లాలో స్టూడెంట్ నర్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధి ఘనాపూర్‌లోని మెడిసిటీ నర్సింగ్ కాలేజ్ విద్యార్థులు పాల్గొని అత్యుత్తమ ప్రదర్శనతో ట్రోఫీని గెలుచుకున్నారు. ఈ సందర్భంగా షేర్ మెడికల్ కేర్ ఫౌండేషన్ అధ్యక్షుడు శివరామకృష్ణ, డైరెక్టర్ మల్లికార్జున్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ హైమావతి, పీడీ శివారెడ్డి విద్యార్థులను అభినందించారు.

## ఘనంగా 'ఔమోజయ వసుధైక కుటుంబ' వేడుకలు



కీసర: శ్రావణమాస ఏకాదశి సందర్భంగా ఔమోజయ విశ్వ మహిళా సేవా సమితి ఆధ్వర్యంలో ఔమోజయ వసుధైక కుటుంబ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం బాలకన్య మాతలకు చీరల పంపిణీ, మహిళలకు గౌరమ్మ సారె, అనంతరం అన్నప్రసాదవితరణ, సాయంత్రం యాగం, దివ్య సత్సంగం కార్యక్రమాలు నిర్వహించారు. ఔమోజయ ఏకోపాసన మహాధర్మం ట్రస్ట్ సెక్రటరీ పరమోజీ బ్రహ్మ శాస్త్రజ్ఞ, ఔమోజక భవతి క్షేత్రం కార్యనిర్వహణ అధికారి ఋషి ప్రజ్ఞానంద స్వామిజీ, పాలక మండలి అధ్యక్షులు భవసింగ్, విశ్వ మహిళా సేవా సమితి రాష్ట్ర అధ్యక్షురాలు అనుప, సత్య ఔమోజయులు, భక్తులు పాల్గొన్నారు.

## రామలింగేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ



స్వామివారిని దర్శించుకున్న ఎంపీ ఈటల రాజేందర్

శామీర్‌పేట్: రామలింగేశ్వరస్వామి దేవాలయాన్ని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. మూడు చింతలపల్లి మున్సిపాలిటీ, అద్రాస్‌పల్లిలో గత మూడు రోజులుగా భవానీరామలింగేశ్వరస్వామి ఆలయంలో శివ పంచాయతన సహిత ఆంజనేయ, గణపతి, నవగ్రహ, ధ్వజ శిఖర ప్రతిష్ఠాపనోత్సవం వేద మంత్రోచ్చరణల మధ్య ఘనంగా నిర్వహిస్తున్నారు. ఎంపీ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎంపీపీ చంద్రశేఖర్‌యాదవ్, ఆలయ చైర్మన్ ఆది అజయ్‌కుమార్, మాజీ సర్పంచ్ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కీసర: వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని చీర్యాలలో స్పెషల్ ఆఫీసర్ పుష్పలత ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ డెంగీ, మలేరియా, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటింటికీ తడి, పొడి వ్యర్థాలు వేరుచేయడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై అవగాహన కల్పించారు. కమిషనర్ వెంకట్‌రెడ్డి, డీఈఈ బాలమురళి, మేనేజర్ వెంకటేశం, పంచాయతీ సెక్రటరీ నారాయణగౌడ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభు, వార్డు ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి ఆత్మహత్య

శామీర్‌పేట్: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మంగళవారం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మూడుచింతలపల్లి మున్సిపాలిటీ, జగ్గంగూడకు చెందిన కుంట బిక్షపతి (38), భార్య కుమార్తె, కుమారుడు ఉన్నారు. కాగా ఆదివారం మధ్యాహ్నం భార్య పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లింది. పుట్టింటికి వెళ్లిన భార్య భిక్షపతికి పలుమార్లు ఫోన్ చేసినా స్పందించ లేదు. దీంతో మంగళవారం పక్కింటి వారికి ఫోన్ చేసి ఇంట్లో ఉన్నాడా.. లేదో చూడమని చెప్పగా.. వారు ఇంటి వద్దకు వెళ్లగా ఇంట్లో నుంచి దుర్వాసన వస్తున్నట్లు గమనించి కుటుంబసభ్యులతో పాటు పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి చూసేసరికి ఇంట్లో ఉరేసుకుని కనిపించాడు. మృతదేహం కుళ్లిన స్థితిలో ఉందని, సుమారు రెండ్రోజుల క్రితం (ఆదివారం రాత్రి) ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

## 'తల్లిపాలు బిడ్డకు అమృతం'



జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ నాచారం కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాన్ని పురస్కరించుకుని అంగన్‌వాడీ టీచర్ అనసూయ ఆధ్వర్యంలో మంగళవారం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీడీపీవో స్వాతి హాజరై మాట్లాడుతూ.. తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటిదన్నారు. తల్లిపాల ప్రాముఖ్యతపై సరైన అవగాహన లేకపోవడంతో పిల్లలు అనారోగ్యం భారిన పడుతున్నారన్నారు. అనంతరం గర్భిణీలకు సీమంతాలు చేశారు. డాక్టర్ సుష్మ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ధనలక్ష్మి, అంగన్‌వాడీ సిబ్బంది, చిన్నారులు పాల్గొన్నారు.

## సంతానం కలగలేదనే మనస్తాపంతో..

**చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య**

శామీర్‌పేట్: పిల్లలు పుట్టడం లేదని మనస్తాపంతో చెరువులో దూకి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మంగళవారం శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధిత కుటుంబీకుల వివరాల ప్రకారం.. నగరంలోని బొల్లారం ప్రాంతానికి చెందిన రవికాంత్‌రావు (38)కు శాలినితో వివాహమైంది. కాగా 12 ఏళ్లుగా సంతానం కలగడం లేదని మనస్తాపంతో ఇంట్లో నుంచి బయటకు వెళ్తున్నానని చెప్పి వచ్చాడు. ఈ క్రమంలో మంగళవారం శామీర్‌పేట పెద్దచెరువులో శవమై తేలాడు. ఈ మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామ నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

## రేణుకాఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు



ఆలయ వార్షికోత్సవంలో కార్పొరేటర్ శ్రీదేవి

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్, బీఎన్‌రెడ్డినగర్‌లోని రేణుకా ఎల్లమ్మ ఆలయ మొదటి వార్షికోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు ఆమెను ఘనంగా సత్కరించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగిళ్ల బాల్‌రెడ్డి, ప్రభుగౌడ్, సత్తమ్మ, రమాదేవి, సంధ్య, మల్లేష్, నర్సింగ్‌రావు, శంకర్, సదానందం, బాలరాజు, సురేష్, శ్రీనివాస్, మోహన్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ రేషన్‌కార్డులు అందిస్తాం

**రాష్ట్ర ఐటీశాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శ్రీధర్‌బాబు**



లబ్ధిదారులకు రేషన్‌కార్డు పత్రాలు అందజేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

మేడ్చల్‌రూరల్: రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మంగళవారం మేడ్చల్ మున్సిపల్ పరిధి అత్వెల్లిలోని జీఎస్ఆర్ కన్వెన్షన్‌హాల్‌లో నూతన రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ మనుచౌదరిలతో కలిసి పాల్గొన్నారు. నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన లబ్ధిదారులకు నూతన రేషన్‌కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజాపాలన ప్రభుత్వంలో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆహార భద్రత కార్డులు ఇస్తున్నామన్నారు. రాష్ట్రంలో రేషన్ కార్డుల పంపిణీ జరుగుతుందని రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరమన్నారు.

**అందరికీ సన్నబియ్యం..**

గతంలో గొప్ప వాళ్లే సన్న బియ్యం తినేవారని, ప్రస్తుతం పేదలు కూడా సన్నబియ్యం తినాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రేషన్‌కార్డులపై ఒక్కొక్కరికి సుమారు 6 కేజీల సన్నబియ్యం ఇస్తున్నామని తెలిపారు. గత పాలకులు పదేళ్లుగా అనేక మంది రేషన్‌కార్డులకు ఎన్నో ఇబ్బందులు పడ్డారని, ప్రస్తుతం ఆ పరిస్థితులు లేవన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రాజకీయాలకతీతంగా రేషన్‌కార్డులు అందిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు రేషన్ కార్డులు రాని వారు నేరుగా మీ–సేవా కేంద్రంలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

◆ జిల్లాలో సుమారు 40,082 కొత్త రేషన్ కార్డులను జారీ చేస్తున్నామని, పాత రేషన్ కార్డులలో కొత్తగా సభ్యులను చేర్చడం, పేర్లు తొలగించడం వంటి మార్పులతో దాదాపు 82 వేల రేషన్ కార్డులు, మొత్తం 1,22,000 కార్డులు పంపిణీ చేశారు. అతి త్వరలో ఇంకో 60 రేషన్ కార్డులను సిద్ధం చేసి, పంపిణీ చేస్తామని మంత్రి పేర్కొన్నారు. సుమారు 2 లక్షల రేషన్ కార్డులను మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లాలోని లబ్ధిదారులకు అందిస్తున్నట్లు పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి

◆ అర్హులైన ప్రతి ఒక్కరికీ నియోజకవర్గంలో పారదర్శకంగా 3500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లను అందిస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా శాసన మండలి సభ్యులు, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రం మహిళల ఆర్థిక స్వావలంబనకు వడ్డీలేని రుణాలు ఇస్తున్నామన్నారు. నియోజకవర్గం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు, చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ మను చౌదరి చేతుల మీదుగా లబ్ధిదారులకు రూ. కోటి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్‌యాదవ్, గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులుయాదవ్, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, కీసర ఆర్డీఓ ఉపేందర్‌రెడ్డి, సివిల్ సప్లై అధికారి శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ భూపాల్, వివిధ శాఖల జిల్లా అధికారులు, రేషన్‌కార్డుల లబ్ధిదారులు తదితరలు పాల్గొన్నారు.